# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ హెచ్చరించారు.

- ❖ రాష్ట్ర హైకోర్టులో ఇటీవల నియమితులైన ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

- ❖ అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు పలు వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

- ❖ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు.

======================

రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచితంగా ఇసుకను అందజేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర శివారులలోని పెన్నా నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ లను ఆయన అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల అవసరాల దృష్ట్యా మరో 4 ఇసుక రీచ్ లను పెన్నా నదిలో ప్రారంభిస్తామన్నారు. ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్లను కూడా అనుమతించడంతో తక్కువ ధరకే ఇసుక లభిస్తోందన్నారు. ఉచిన ఇసుక విధానంలో అక్రకమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు.

(వాయిస్ 37 సెకన్లు)

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన ముగ్గురు న్యాయమూర్తులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేయించారు. మొదటి కోర్టు హాల్లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో మహేశ్వరరావు కుంచెం, తూటా చంద్ర ధన శేఖర్, చల్లా గుణరంజన్ లు అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాధ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

======================

అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు పెరోట్, టెస్లా సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భాగంగా అలయెన్స్ టెక్సాస్ తరపు ప్రాజెక్టులకు రాష్ట్ర తీరప్రాంతం అనుకూలమని మంత్రి వారికి వివరించారు. ఏవియేషన్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. రాష్ట్రంలోని పోర్ట్‌లు, హైవేలు, పట్టణాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు.

======================

గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని మహిళా, శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలం కూర్మరాజుపేట, కొత్తవలస పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన “పల్లె పండుగ” కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను మా ఆకాశవాణి పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి సి.హెచ్ శ్రీనివాసరావు అందిస్తారు.

(వాయిస్ 29 సెకన్లు)

======================

ప్రతి ఒక్కరూ రక్త దాతలుగా మారాలని అనంతపురం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పి. జగదీష్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు.

======================

ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు పశ్చిమ గోదావరి జిల్లాలో 368 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని ఆ జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. తాడేపల్లి గూడెంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... జిల్లాలో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రేపు పెద్ద తాడేపల్లిలో ప్రారంభించను న్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో కోటి గోనె సంచులను సిద్ధం చేశామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 30 లక్షల సంచులను పంపిణీ చేశామని వివరించారు. దీంతో పాటు ధాన్యం తరలించే ఒక వెయ్యి 700 వాహనాలకు జిపిఎస్ సిస్టంను అమ ర్చామని వెల్లడించారు. మండల, గ్రామ, డివిజన్ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వివరించారు.

విరామం

======================

మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి వర్చువల్ విధానంలో అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 72 గంటల్లో అర్జీలను పరిష్కరించి ఫిర్యాదు దారులకు సంక్షిప్త సందేశం ద్వారా వివరాలను అందించాలని పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

=====================

పారిశ్రామిక వర్గాలతో స్నేహపూర్వక పైఖరి కొనసాగిస్తూ.. రాష్ట్ర ఆర్థిక పురోగతిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సొసైటీ ఫర్ ఎంటర్ ప్రైజ్ డెవలప్ మెంట్ అండ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్ మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి తెలిపారు. విజయవాడలోని సీడాప్ కార్యాలయంలో సృజనాత్మకత భవిష్యత్తు నైపుణ్యాలపై ఈరోజు నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నాయకత్వంలో ఇప్పటికే 6 కొత్త పారిశ్రామిక విధానాలను ప్రకటించారని.. అవన్నీ పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీడాప్ నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉపాధి కార్యక్రమాలు వికసిత్ భారత్ 2047కు, ఆత్మనిర్భర్ భారత్‌కు, ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు దగ్గరగా ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

=====================

రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధరేశ్వరి అన్నారు. ఈరోజు ఆమె విజయవాడలో మాట్లాడుతూ... రాష్ట్ర రాజధాని అమరావతి కనెక్టివిటీ కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. జాతీయ స్థాయిలో పరిపాలనా దక్షత కనబరిచి, దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీదే అని వ్యాఖ్యానించారు. ప్రతీ 6 నెలలకు ఒకసారి కొత్త సభ్యులను చేర్చుకోవటంతో పాటు బూత్ లెవెల్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవడం బీజేపీ విధానమని పేర్కొన్నారు. ప్రధానమంత్రితో సహా అందరూ తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవటం జరుగుతుందని, మొదటి సారిగా ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టామని వివరించారు.

=====================

జాతీయ పశుగణన సర్వేను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించి, పాడి రైతులకు మేలు జరిగేలా చూడాలని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జాతీయ పశుగణన మాన్యువల్ పుస్తకాన్ని మంత్రి పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లులో ఆవిష్కరించి, సర్వే సిబ్బందికి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు నిర్వహించే పశుగణన సర్వేను అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. జనాభా లెక్కింపు ఎంత అవసరమో పశుగణన లెక్కింపు కూడా అంతే ముఖ్యమని, పశుసంవర్ధక శాఖ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

=====================

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ పోటీల్లో జిల్లాలోని అధికారులు, సిబ్బంది పాల్గొనాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఏ.ఎస్. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఆయన పాడేరులో మాట్లాడుతూ... రేపటి నుండి రెండు రోజుల పాటు ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు నవంబర్ 06 నుండి 11వ తేదీ వరకు విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడా ప్రాదికారిక సంస్థ నిర్ణయించిన 18 క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. రేపు స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కొన్ని పోటీలు, 30వ తేదీన అనకాపల్లి డావిన్సి పాఠశాలలో స్విమ్మింగ్ పోటీలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు.

=====================

తిరుపతి జిల్లా శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు ఈరోజు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివార్లను యాగశాలకు ఆహ్వానించి, వైదిక కార్యక్రమాల్లో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

=======================

=======================